బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవికిషోర్



సాక్షి, సిటీబ్యూరో: నాంపల్లిలోని మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది కె. రవికిషోర్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలియజేశారు. 33 ఏళ్లకు పైగా న్యాయవాద వృత్తిలో రాణిస్తున్న రవికిశోర్ నాయకత్వం, సహచరుల్లో మరింతగా వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు విలువలను బలోపేతం చేసేందుకు ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పీరం చెరువును పరిరక్షించాలి

మణికొండ: గండిపేట మండలం, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీరంచెరువు పలు చోట్ల కబ్జాలకు గురవుతుందని అధికారులు స్పందించి పరిరక్షించాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, రిటైర్డ్ ఐపీఎస్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కోరారు. పీరం చెరువు చుట్టూ పక్కల భూగర్భ జలాలు పెరిగితే వన్యప్రాణులకు మేలు జరుగుతుందని అలాంటి చెరువు బఫర్, ఎఫ్‌టీఎల్ పరిధిలో కొంతమంది నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. చెరువులను పరిరక్షిస్తామని చెబుతున్న హైడ్రా అధికారులు ఈ విషయాన్ని వెంటనే పట్టించుకోవాలన్నారు. చెరువును పూర్తి స్థాయిలో సర్వే చేయించి హద్దులను నిర్ణయించటంతో పాటు ఇప్పటికే వచ్చిన నిర్మాణాలను పూర్తిగా తొలగించాలని హైడ్రా కమిషనర్, రాజేంద్రనగర్ ఆర్‌డీఓ, జిల్లా కలెక్టర్, సీడీఎంఏ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థినికి 'బెస్ట్ రిప్లై అవార్డు'



అవార్డు అందుకుంటున్న హెచ్‌సీయూ విద్యార్థిని లాస్యప్రియ

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పోస్టుగాడ్యుయేషన్ విద్యార్థిని లాస్య ప్రియ ఉత్తమ ప్రత్యుత్తర అవార్డు (బెస్ట్ రిప్లై అవార్డు) అందుకుంది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లోని పొలిటికల్ సైన్స్ విభాగంలో లాస్యప్రియ ఐఎంఏ చదువుతోంది. ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన నేషనల్ యూత్ పార్లమెంట్–2025లో ఈ అవార్డు అందుకుంది.జిల్లా స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు జరిగిన అన్ని స్థాయిలలో ప్రతిభ చాటింది. ఆమెను పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు అభినందించారు.

వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 24మంది మైనర్లు

బంజారాహిల్స్: మైనర్ డ్రైవింగ్‌పై సోమవారం నుంచి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 10 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పంజగుట్ట ట్రాఫిక్ పోలీసులు 4, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు 10 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు. మైనర్లు నడుపుతున్న వాహనాలను గుర్తించి వాటిని జప్తు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు, వాహన యజమానులపై కూడా చర్యలు తీసుకోనున్నారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు లైసెన్స్‌లు తనిఖీ చేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ స్పెషల్ డ్రైవ్ జరిగింది.

బట్టతలపై వెంట్రుకలు మొలిపిస్తానంటూ ప్రచారం

బహదూర్‌పురా: బట్టతలపై వెంట్రుకలు మొలిపిస్తానని ఓ యువకుడు చేసిన ప్రచారం పాతబస్తీలో హల్చల్ సృష్టించింది. ఢిల్లీకి చెందిన వకీల్ గత కొంత కాలంగా పాతబస్తీ రామనాస్పుర రోడ్డులో కింగ్ పేరుతో కటింగ్ షాపును నిర్వహిస్తున్నాడు. నెల రోజుల నుంచి బట్టతలపై జుట్టు మొలిపిస్తానంటూ ప్రచారం చేయడంతో పెద్ద ఎత్తున యువకులు క్యూలో నిలబడి మందు పెట్టించుకున్నారు. ఈ వార్త సోషల్ మీడియాలో హల్చల్ సృష్టించింది. వకీల్ మొదట బట్టతల గుండు కొట్టి రూ.100 తీసుకొని తర్వాత జుట్టు మొలిపించేందుకు కెమికల్‌ను బట్టతలపై రాసేవాడు. సోషల్ మీడియాలో ఈ వార్త వైరల్ కావడంతో నగర వ్యాప్తంగా కొందరు బట్టతల ఉన్న వారు ఆందోళన చేపట్టినట్లు సమాచారం. ఉన్న కాస్త జుట్టు కూడా పోయిందంటూ ఆందోళనకు గురయ్యారు. అయితే ఈ విషయంపై ఇప్పటి వరకు ఎవరు ఫిర్యాదు చేయలేదని కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్ ఆసిఫ్ తెలిపారు.

ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీదేవి

సిటీ కోర్టులు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సును రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ..ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదన్నారు. నేటి కాలంలో, ప్రజలు ఆరోగ్యంగా లేకపోవడానికి అతిపెద్ద కారణం జంక్ ఫుడ్ తీసుకోవడమే అన్నారు. చాలా మంది రెడీమేడ్ ఫుడ్, అవుట్‌డోర్ ఫుడ్‌ను ఇష్టపడుతూ ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. జంక్ ఫుడ్ అనేక రకాల రసాయనాలతో తయారు చేయబడుతుందని గుర్తుచేశారు. చాలా వ్యాధులు రావడానికి ఇదే అతిపెద్ద కారణమన్నారు. మనం ఆరోగ్యంగా ఉండాలనుకుంటే, మనం ఎల్లప్పుడూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినాలని గుర్తుచేశారు. ఆరోగ్యకరమైన మానవ శరీరం అన్ని ఆనందాలకు ప్రధాన మూలమన్నారు. ప్రజలు దీనిని గొప్ప వరంలా అంగీకరించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం రోజు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని ఆరోగ్య సంస్థలు వివిధ ఆరోగ్య అధికారులు, ప్రతినిధుల భాగస్వామ్యంతో అవగాహన తరగతులను నిర్వహిస్తాయని తెలిపారు. ఈ తరగతులు చాలా ముఖ్యమైనవి, ఎందుకంటే అవి మన సమాజంలోని వివిధ తెలియని వ్యాధులపై మనకు జ్ఞానాన్ని అందిస్తాయన్నారు. అనంతరం రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ముఖ్యంగా ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించి, ఆరోగ్య సంరక్షణలోని సమస్యలను పరిష్కరించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం, ప్రపంచ వ్యాప్తంగా అందరికీ ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అందించడం, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, ఆరోగ్యానికి సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశాలను ప్రపంచవ్యాప్తంగా చర్చించడమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు విష్ణువర్ధన్, ప్రముఖ విద్యావేత్త వసుధారాణి, న్యాయవాదులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మురుగుమయం.. డీఈఓ కార్యాలయం



అబిడ్స్: హైదరాబాద్ నగర జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో మూడు రోజులుగా మురుగు నీరు నిలవడం అందరినీ కలవరానికి గురిచేస్తుంది. ఇటీవల కురిసిన భారీ వర్షంతో వర్షపు నీరు, డ్రైనేజీ నీరు డీఈఓ కార్యాలయం ఆవరణలో నిలిచిపోయింది. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది, అధికారులు, ప్రతిరోజు డీఈఓ కార్యాలయానికి వచ్చే విద్యాసంస్థల నిర్వాహకులు, పలువురు ఉపాధ్యాయులు, పనుల కోసం వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో సైతం ఈ డ్రైనేజీ నీరుతో డీఈఓ కార్యాలయం సిబ్బంది నానా ఇక్కట్లు పడాల్సిందేనని వారంటున్నారు. సోమవారం డీఈఓ కార్యాలయ ఆవరణలో మురుగునీటిని చూసి అక్కడికి వచ్చిన పలువురు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని డీఈఓ కార్యాలయం ఆవరణలో మురుగు నీరు నిల్వకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మురుగునీరు వాసనతో విద్యాశాఖ కార్యాలయంలో కూర్చొని విధులు నిర్వహించే సిబ్బంది బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

సందడిగా స్నాతకోత్సవం



పట్టాలు పొందిన విద్యార్థులతో అధ్యాపక బృందం

గోల్కొండ: చిన్నతనం నుంచి పిల్లలు తమ సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవాలని తెలంగాణ ఇన్‌ట్యాక్స్ ప్రధాన అధికారి ఎస్.ఎస్.సోరేన్ అన్నారు. సోమవారం మురాద్‌నగర్ రవీంద్రభారతి పాఠశాలలో చిన్నారుల స్నాకోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె ప్రీ ప్రైమరీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలను అందజేశారు. స్నాతకోత్సవ దుస్తుల్లో చిన్నారులు ఎంతో హుందాగా తమ పట్టాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రీ ప్రైమరీ దశ విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, మెహిదీపట్నం డీన్ ప్రియమణి, ఇన్‌చార్జి మధు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు

చార్మినార్: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్ సూచించారు. జోనల్ కమిషనర్ టి. వెంకన్న పర్యవేక్షణలో నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం జరిగింది. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అక్రమ నిర్మాణంపై చార్మినార్ సర్కిల్ పరిధిలో రెండు ఫిర్యాదులతో పాటు రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి మరో ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ..తమకు అందిన ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ రాజారావు, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, మలేరియా విభాగం సీనియర్ ఎంటామాలజిస్ట్ నామాల శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, వెటర్నరీ సీనియర్ అసిస్టెంట్ హమీద్, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



గోల్కొండ: నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వరం లాంటివని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం టొలిచౌకిలోని తన కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని రకాల ధృవ పత్రాలు జత చేసి సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా శస్త్ర చికిత్సల కోసం దరఖాస్తు చేసుకునే వారు వైద్యులు, ఆసుపత్రి బిల్లులు తప్పనిసరిగా జతర చేయాలన్నారు. కార్యక్రమంలో సయ్యద్ రఫత్ హుస్సేన్, అలీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరా ప్రియదర్శిని కళాశాల వార్షికోత్సవం



వేడుకల్లో డీఎస్ఆర్ రాజేందర్ సింగ్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ

అబిడ్స్: కార్పొరేట్ తరహాలో విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించడంలో నైపుణ్యాన్ని ఇందిరా ప్రియదర్శిని మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిరూపించుకుందని కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డీఎస్ఆర్ రాజేందర్ సింగ్ పేర్కొన్నారు. సోమవారం ఇందిరా ప్రియదర్శిని కళాశాల 44వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్ఆర్ రాజేందర్ సింగ్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలోని టాప్–10 కాలేజీల్లో ఇందిరా ప్రియదర్శిని నిలిచిందన్నారు. న్యాక్–ఏ గ్రేడ్ సాధించడం ద్వారా విద్యార్థినులకు నాణ్యమైన విద్యను బోధిస్తుందన్నారు. ఉత్తమ బోధన అధ్యాపక వనరులను, వారి గొప్ప పరిశోధన అనుభవాలను, వారి భవిష్యత్తు జీవితంలో ఉత్తమ కెరీర్‌లను రూపొందించడంలో ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ మాట్లాడుతూ..తమ కళాశాలలో విద్యతో పాటు సాహిత్య, సాంస్కృతిక, క్రీడలు, ఇతర రంగాల్లో విద్యార్థులు అత్యుత్తమ విజయాలు సాధించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జితేంద్రనాథ్, సీసీఈ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ యాదగిరి, ప్రొఫెసర్ బాలభాస్కర్, కళాశాల అధ్యాపకులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నాంపల్లి: తండ్రిని కోల్పోయిన విద్యార్థులకు ఆర్‌జే ఇన్‌స్పిరేషన్ హ్యాండ్స్, రాధే గ్రూపు సంస్థల సంయుక్త నిర్వాహణలో ఆర్థిక సహాయం చేశారు. సోమవారం రాత్రి నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి హాజరై విద్యార్థులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పలు రకాల వైద్య పరీక్షలు చేశారు. తండ్రి లేని పిల్లలకు విద్య కోసం ఆర్థిక సహాయం సంతోషదాయకమని మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను చేయడానికి ఎన్‌జీఓ సంస్థలు ముందుకురావాలని కోరారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా సరికొత్త స్కీమ్

లక్డీకాపూల్ : బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాదారులకు మరింత ప్రయోజనం చేకూర్చే దిశగా సరికొత్త డిపాజిట్ స్కీమ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. 444 రోజుల కాలపరిమితి కలిగిన బాబ్ స్క్వేర్ డ్రైవ్ డిపాజిట్ పథకాన్ని ప్రవేశపెట్టింది. సోమవారం బ్యాంక్ ఆఫ్ బరోడా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీనా వహీద్ విడుదల చేసిన ఈ డిపాజిట్ స్కీమ్‌లో రూ.7.15లు వడ్డీని అందించనున్నారు. అదే సీనియర్ సిటిజన్లకు రూ.7.65లు, 80 ఏళ్ల పైబడిన వారికి రూ.7.75లు చొప్పున వడ్డీని అందించనున్నట్టు బ్యాంక్ వర్గాలు పేర్కొంటున్నాయి. నేరుగా బ్యాంక్‌లో కానీ డిజిటల్ ఛానల్ ద్వారా కానీ ఈ స్కీమ్‌లో చేరవచ్చన్నారు. ఈ క్రమంలో బాబ్ వరల్డ్ యాప్, బ్యాంక్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ ప్లాట్ ఫారం ద్వారా కూడా ఈ డిపాజిట్ స్కీమ్‌లో చేరవచ్చని బ్యాంక్ వర్గాలు పేర్కొంటున్నాయి.

సన్మానం



విజయశాంతిని సన్మానిస్తున్న వెంకటేశ్

గౌలిపురా: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికైన మాజీ ఎంపీ విజయశాంతిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాజీవ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటేశ్ ఘనంగా సన్మానించారు. శాసన మండలిలో సోమవారం విజయశాంతిని ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వెంకటేశ్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన విజయశాంతిని ప్రజల పక్షాన శాసనమండలిలో తన వాగ్దాటిని వినిపించాలని వెంకటేశ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

సమాజ సేవకే అంకితం

అబిడ్స్: సమాజ సేవకే అసద్‌అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ అంకితమవుతుందని ఆ ట్రస్ట్ చైర్మన్ సేవారత్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. ఇటీవల రఘు అనే వ్యక్తి మృతి చెందడంతో అతని కుమార్తె దివ్య చదువును అసద్‌అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ బాధ్యతలు తీసుకుంది. ఈ సందర్భంగా సోమవారం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎం. ముజీబ్ హుస్సేని రూ.28 వేల చెక్కును దివ్యకు అందించారు. అనంతరం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..గతంలో రెండు పర్యాలు దివ్యకు ఆర్థిక సహాయం అందించామన్నారు. భవిష్యత్తులో కూడా ఆ విద్యార్థికి కావాల్సిన అన్ని సౌకర్యాలను అసద్‌అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అందజేస్తామన్నారు. సేవ చేయడంలోనే ఎంతో ఆనందం, తృప్తి ఉంటుందన్నారు. తన జీవితకాలం సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతానని ముజీబ్ హుస్సేన్ పేర్కొన్నారు.



దివ్యకు చెక్కును అందజేస్తున్న ముజీబ్ హుస్సేని

ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలి



రోజాను సేవా పురస్కారంతో సత్కరిస్తున్న రాజ్ నారాయణ్ ముదిరాజ్, శ్యామ్‌రావు ముదిరాజ్

చార్మినార్: ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని అలియాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శృతి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అలియాబాద్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో వివిధ వ్యాధులపై అవగాహన శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పౌష్టికాహారం తీసుకుంటూ వ్యాధులకు దూరంగా ఉండాలని ఆరోగ్య సూత్రాలు వివరించారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ..40 ఏళ్లుగా ఆరోగ్య సమస్యలపై కేన్సర్, కిడ్నీ, మలేరియా, గుండె, హైపర్ టెన్షన్ తదితర వ్యాధులపై నిర్విరావంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా సేవలందిస్తున్న కటికం రోజాను సేవా పురస్కారంతో సన్మానించారు. కోవిడ్ సమయంలో సేవలు అందించినందుకు రాష్ట్రం నుంచి ఒక్కరికే ఈ సేవా రత్న పురస్కారం ప్రదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ యాక్టివిస్ట్ తయ్యబా తస్లీమా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాశమోని శ్యామ్ రావు ముదిరాజ్, హనుమంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీకాంత్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో ఏనుగు నర్సింహారెడ్డి తదితరులు

పురస్కారాల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలను సోమవారం రవీంద్రభారతిలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సామాజిక సేవా సాహిత్య రంగాలు ఒకదానికొకటి అనుసంధానం కలిగి ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవా ధృక్పథంతో నడవాలని సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, ప్రముఖ గాయకులు దరువు అంజన్న, సినీ గేయ రచయిత అభియన శ్రీనివాస్, విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'జై బాపు.. జై భీం.. జై సంవిధాన్ అభియాన్'ను విజయవంతం చేయాలి



డివిజన్ అధ్యక్షులతో పాటు సమావేశంలో రాజేష్ కుమార్

చార్మినార్: జై బాపు..జై భీం..జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ కోరారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్ అధ్యక్షులతో సోమవారం దూద్ బౌలిలో సమావేశం నిర్వహించి నాయకులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉంటున్నాయని, ఈ సందేశాన్ని గడపగడపకూ వెళ్లి వివరించాలన్నారు. అలాగే ప్రతి కుటుంబాన్ని కలిసి వారి సమస్యలు తెలుసుకోవడానికి పాదయాత్రలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని డివిజన్ అధ్యక్షుడు నజీర్ ఖాన్, భానుచందర్‌యాదవ్, హమీరుద్దీన్, నసీర్ ఫారూకీ, గులాం నబి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అబేద్ అలీ, మీర్ మొహమ్మద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



విజయనగర్‌కాలనీ: క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను సునాయాసంగా చేరుకుంటారని విద్యావేత్తలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. యూకేజీ నుంచి 1వ తరగతికి, 5 నుంచి 6వ తరగతిలోకి ప్రమోట్ అయిన విద్యార్థులకు పట్టాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు విద్యతో పాటు వినయాన్ని, క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గంగాకిరణ్, ఈ కిడ్స్ కో ఆర్డినేటర్ రష్మిక, ఈ ఛాంప్ కో ఆర్డినేటర్ ఫర్హానా, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



యాకుత్‌పురా: ఇటీవల జరిగిన ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పురానీహవేలీలోని కోర్టు బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా పి.నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎ.ఎన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బి.అజయ్, సంయుక్త కార్యదర్శిగా ఎ.రాజిరెడ్డి, కోశాధికారిగా వి.నిర్మల, లైబ్రరి కార్యదర్శిగా రాకేష్ కులకర్ణి, క్రీడా, సంస్కృతిక కార్యదర్శిగా మహ్మద్ అఫ్జల్ పాషా, మహిళా ప్రతినిధిగా జి.రేణుక, కార్యవర్గ సభ్యులుగా ఎ.ప్రణతి లక్ష్మి, ఇ. శ్రీనివాస్‌రెడ్డి, పి.వినయ్‌శంకర్, కె. భానుచందర్, సందీప్ సింగ్, జె.రాజశేఖర్‌యాదవ్, సామ్రాట్ కెన్నెట్ పాల్ బాధ్యతలు స్వీకరించారు.

ఎలా నడవాలి సారూ..!



కేబీఆర్ పార్కు ఫుట్‌పాత్‌పై అడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ఫుట్‌పాత్‌లు ఫ్లెక్సీలకు అడ్డాగా మారాయి. పాదచారులు నడవడానికి వీల్లేకుండా ఫ్లెక్సీలను ఫుట్‌పాత్‌లపైనే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో కేబీఆర్ పార్కుకు వచ్చే వాకర్లు, సందర్శకులు, ఇతర పాదచారులు ఫ్లెక్సీలను దాటుకుని ముందుకు వెళ్లలేక రోడ్డును ఆశ్రయిస్తున్నారు. కొంతకాలంగా కేబీఆర్ పార్కు ముందు ఇష్టానుసారంగా పలు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. ఒకవైపు ఫుట్‌పాత్‌లపై, మరోవైపు రోడ్డును ఆక్రమించి ఈ ఫ్లెక్సీలు రోజుల తరబడి ఏర్పాటు చేస్తున్నారు. పట్టించుకునేవారు లేకపోవడంతో రెండు వారాల వరకు ఇవి అలాగే ఉండిపోతుండటంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఫ్లెక్సీలు కూలిపోకుండా వైర్లతో ఫుట్‌పాత్‌పై వేసిన దిమ్మెలకు, ఫెన్సింగ్‌కు కడుతున్నారు. దీంతో అటు నుంచి నడుచుకుంటూ వచ్చేవారికి ఈ వైర్లు కనిపించకపోవడంతో కిందపడుతున్నారు. జీహెచ్‌ఎంసీకి స్పష్టమైన వైఖరి లేకపోవడంతో ఫ్లెక్సీల ఏర్పాటుకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టిలో పడాలనే ఉద్దేశ్యంతో చాలామంది కేబీఆర్ పార్కు, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద అడ్డదిడ్డంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. కేబీఆర్ పార్కు ప్రధాన గేటు వద్ద ఫ్లెక్సీ రహిత ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయాలని వాకర్లు డిమాండ్ చేస్తున్నారు.